# ఆది దంపతులు

గోడ గడియారం పన్నెండు గంటలు కొట్టింది. కుర్చీలో కునికుపాట్లు పడుతున్న కోమలి ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది. ఎదురుగా పట్టెమంచం మీద పాలతరగలా తెల్లదుప్పటి..దానిమీద మగతగా పడి ఉన్న మరుమల్లెలు...రోజ్ వుడ్ టేబుల్ మీద పళ్ళు...స్వీట్లు...నుసిగా మిగిలిన అగరొత్తులు..బుద్ధిగా కూర్చున్న పన్నీరు బుడ్డి...

నడిరేయి దాటుతున్నా నారాయణం పత్తా లేదు.

చిన్నదీపం వెలుగులో శోభనం గది మరింత చిన్నబోయింది. భర్త ఎక్కడికెళ్ళినట్టు?

మొదటిరోజు ఈ అపశ్రుతి ఏమిటి? భర్తతో పాటు వచ్చిన ఆడపడుచు నాగమ్మ సందు దొరికినప్పుడల్లా తమ్ముడితో గుసగుసలాడటం గమనిస్తూనే ఉంది. ఏమి బోధిస్తోందో ఆ తంపులమారి తల్లి!

వివాహ జీవిత ప్రయాణం తొలిరోజుతోనే మొదలవుతుంది. ఆత్మీయతలు ఇచ్చిపుచ్చుకోవడం..భౌతికంగా, మానసికంగా ఒక్కరవటం... ఒకరినొకరు అర్థం చేసుకోవడం...ఇవన్నీ సజావుగా సాగితేనే రాబోయే రోజులు బావుంటాయి. కోమలి అమ్మమ్మ చెప్పిన సలహాలన్నీ గుర్తుంచుకుంది. సిగ్గు ఆభరణం కావాలి. అభ్యంతరం, అవాంతరం కాకూడదు. ప్రేమ ఇస్తేనే తిరిగి మనకి దక్కుతుంది. ఏదైనా సాధించటానికే పట్టుదల... పంతాలతో పచ్చని కాపురం పాడుచేసుకోకూడదు. అణకువ అంటే సంస్కారం, ఆత్మన్యూనతగా, అవతలివాళ్ళకి లొంగిపోవటం కాదు. నారాయణాన్ని తాను చూడలేదు. అసలు పెళ్ళిచూపులే జరగలేదు.

తండ్రి అన్నీ నిర్ణయించాడు. తనకి సమాచారంగా చెప్పారు. ఇంటి పద్ధతి అంతే. అన్నీ నాన్నే నిర్ణయిస్తాడు. ఆయనకంటే తన మంచి ఇంకెవరు ఎక్కువ కోరతారు? ఇది నాన్నమీద ఇంట్లో అందరికీ ఉన్న నమ్మకం.

ఆలోచనల మధ్య మళ్ళీ కళ్ళు మూతలు పడుతుండగా...కిటికీ దగ్గర ఎవరో మెల్లగా తడుతున్న శబ్దం వినిపించింది. శోభనం గదికి దొడ్డివైపు కిటికీతోపాటు

ఒక దర్వాజా కూడా వుంది. నడిరేయి నీరవ నిశీధిలో కిటికీ ఎవరు తడుతున్నారు?

దొంగేమో! అరే భగవాన్..అసలే ఒంటరిగా వదిలేసి తుంటరి మొగుడు తుర్రుమనేశాడు. అది చాలనట్టు ఇప్పుడీ దొంగ కూడానా. ఏదైతేనేం...తాను కిటికీ తియ్యదు గాక తియ్యదు. గట్టిగా నిర్ణయించుకుంది. మళ్ళీ మృదువుగా కిటికీ వద్ద తట్టిన శబ్దం... ఈ మాటు గుసగుసగా.

"కోమలీ! నేను నారాయణాన్ని..తలుపు తెరు.." అన్న మాటలు వినిపించి ఆశ్చర్యంతో వెన్ను నిటారుగా పెట్టి వింది కోమలి. మళ్ళీ అదే శబ్దం..అవే మాటలు.

మెల్లగా కిటికీ రెక్క తెరిచింది.

"అబ్బ ఏమిటా మొద్దు నిద్దర..నేనే..తలుపుతియ్యి" కోమలి భర్తను గుర్తు పట్టింది. వెళ్ళి తలుపు తీసింది. గబగబా లోపలికి వచ్చి తలుపు గడియవేశాడు. తమకంగా తట్టుకోలేనట్టు కోమలిని గాఢంగా కౌగిలించుకుని మంచంవైపు తీసుకువెళ్ళాడు.

ఏం జరుగుతోందో తెలిసే లోపల అంతా జరిగిపోయింది.

సేద తీరుతున్న మొగుడితో "ఎక్కడికెళ్ళారు? ఇలా దొడ్డిదారిన రావటం ఏమిటి?" అంది కోమలి.

"మా అక్క నన్ను మా ఊరెళ్ళిపొమ్మంది.."

"ఎందుకని?" మంచంమీద లేచి కూర్చుని అడిగింది కోమలి.

"పట్టుచీర పెడతారనుకుంటే నేత చీర పెట్టారటగా..."

"పట్టుచీర పెట్టాలా?" ఆశ్చర్యంగా అడిగింది.

"మా అక్కయ్యకి చీరల పిచ్చిలే. ఏ శుభకార్యం జరిగినా ముందు ఆవిడకు కొత్తచీర పెట్టాలి. అది కూడా ఆవిడ కోరుకున్న రకం.."

"ఊరెళ్ళిపొమ్మంటే ఎందుకిలా దొంగలా తిరిగొచ్చారు?" గడుసుగా అంది.

నారాయణం కోమలికేసి చిలిపిగా చూశాడు.

"ఇప్పుడు వెళ్ళిపోనా?"

"మళ్ళీ ఇదో బెదిరింపా?"

"కాదు. నిజమే. ఇంకో గంటలో రైలువుంది. మా ఊరు వెళ్ళక తప్పదు."

"ఎందుకు వచ్చినట్టు..ఎందుకు వెళ్తున్నట్టు?"

"నీ కోసం వచ్చాను. మా అక్క చూస్తే గొడవ చేస్తుంది గనక వెళ్ళాలి"

"ఇదెక్కడి అక్కగారండీ బాబూ..." అంటూ నెత్తిన చెయ్యి పెట్టుకుంది.

◆◆◆

"అదమ్మా సంగతి. మా కాలంలో ఇలాంటివి జరుగుతుండేవి. పోను పోను అన్నీ సర్దుబాటయ్యాయి. మా మామగారు వాళ్ళూ ఏడుగురు అన్నదమ్ములు. ఈయనే పెద్దాయన. ఆ కుటుంబంలో మొదటిపెళ్ళి మాదే. అందుకే అందరూ మమ్మల్ని ఆది దంపతులనేవారు..." అంటూ ముగించింది కోమలమ్మ.

అమ్మమ్మ మాటల్ని ఆశ్చర్యంగా వింది పార్వతి.

భర్త శివతేజమీద అప్పటిదాకా ఉన్న కాస్త కోపమూ కరిగిపోయింది. ఇద్దరిదీ పెద్దలు కుదిర్చిన పెళ్ళి. ఆడబిడ్డలు లేరు. అన్నదమ్ములూ లేరు. ఏకైక పుత్రరత్నం. పెద్ద కంపెనీలో జనరల్ మేనేజర్.

పెళ్ళి ఘనంగా జరిగింది.

సంప్రదాయ పద్ధతిలో శోభనం వేడుకలు ఏర్పాటు చేస్తే శివతేజకి నచ్చలేదు. హనీమూన్ కోసం ఊటీ వెళ్ళాలనే అతని ప్రపోజల్‌ని పెద్దలు వాయిదా వేసుకోమన్నందుకు మొహం చిట్లించుకున్నాడు.

ఉదయం నుండి అందరూ అతనికోసం నిరీక్షిస్తూనే ఉన్నారు. పార్వతి కూడా...అతను రాకపోవడం పార్వతికి కోపం కలిగించింది. అమ్మమ్మ కోమలమ్మ దగ్గర బుంగమూతితో కూర్చుంటే, ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని తన శోభనం కథ వినిపించింది.

వాళ్ళ అమ్మమ్మ చెప్పిన సలహాల్నే ఈ అమ్మమ్మ వినిపించడంతో పార్వతి కాస్త మెత్తబడింది.

శివతేజ-పార్వతి 'మేడ్‌ఫర్ ఈచ్ అదర్' అన్నారందరూ. అతన్ని శివ-తేజ అని రెండు పేర్లతో పిలుస్తారు. ఆమెను పార్వతి అని ఒక్క పేరుతోనే పిలుస్తారు.

000

భర్త ప్రేమగా 'పారూ' అని పిలుస్తాడేమో అని..ఆ పిలుపు శోభనం గదిలోనే మొదలవుతుందని ఆశపడింది. కానీ, ఆ మహాదేవుడు పత్తాలేదు. పార్వతికి అశాంతిగా ఉంది. మనసంతా శూన్యంగా అనిపిస్తోంది. అంతలో తండ్రి వచ్చి కొత్తవార్త విన్పించాడు.

"అల్లుడు ఊళ్ళోకొచ్చి మానస స్టార్‌హోటల్‌లో దిగాడని తెలిసి, మనింటికి తీసుకువద్దామని వెళ్ళాను. అవమానంగా మాట్లాడాడు. తన మాటలకి విలువలేని చోటుకు రానన్నాడు. రేపే ఊటీ వెళ్ళే ఏర్పాట్లు చేస్తానని, ఈ ఒక్కరోజు మనింట్లో వుండమన్నాను. రానంటే రానన్నాడు" అన్నాడు. నిరాశా నిస్పృహలతో, తల దించుకుని

బాధగా మాటలన్నీ వింది పార్వతి.

◆ ◆ ◆

కారు మానస స్టార్ హోటల్ ముందు ఆగింది. అప్పటికి రాత్రి పదకొండు గంటలు. డ్రైవరు సూట్‌కేసుతో ఆమె వెంట రిసెప్షన్ వరకు వెళ్ళాడు.

"శివతేజ ఏ రూంలో ఉన్నారు?"

"రూమ్ నెంబరు త్రినాట్ త్రీ. మీరెవరు మేడమ్?"

"మిసెస్ శివతేజ" అంటూ చకచక లిఫ్టువైపు నడిచింది పార్వతి. గదిముందు నిలబడి కాలింగ్ బెల్ నొక్కింది. ఒకసారి..రెండోసారి..మూడోసారి.. తలుపుతీశాడు శివతేజ. అతని ఆశ్చర్యాన్ని పట్టించుకోకుండా, తోసుకుంటూ లోపలికి వెళ్ళింది పార్వతి. శివతేజ తలుపు వేసి ఆమె వెంట వెళ్ళాడు. పార్వతి డబుల్ కాట్ మంచం మీద అటు తిరిగి పడుకుంది. శివతేజ సోఫాలో కూర్చున్నాడు. పార్వతి అలా వస్తుందని అతను ఊహించలేదు.

తన ప్రవర్తన ఆమెని బాధించి ఉంటుంది. ఏం చేస్తాడు. చిన్నప్పట్నుంచి తన తత్వం అంతే. తన మాట ఎవరు కాదన్నా సహించలేడు. ఒక్కడే సంతానం కాబట్టి..తన మాటకి ఎవరూ ఎప్పుడూ ఎదురు చెప్పలేదు.

◆ ◆ ◆

పిల్లనిచ్చిన మామగారు...పాత చింతకాయ పచ్చడి సంప్రదాయం పేరుతో తన మాట కాదన్నందుకు బాగా కోపం వచ్చింది. పెళ్ళికి ముహూర్తం సరే, శోభనానికి ముహూర్తం ఏమిటి? పంజరంలో పావురాల జంటలా నాలుగ్గోడలమధ్య, జైలులో ఖైదీల్లా..నాన్సెన్స్..

అందుకే తల్లి మాట కాదనలేక అత్తగారి ఊరువచ్చినా హోటల్‌లో దిగాడు. తండ్రి ఫోను చేసి మాట్లాడితే హోటల్లో దిగినట్లు చెప్పాడు. బహుశా ఆయనే మామగారికి చెప్పి ఉండాలి. వెంటనే వచ్చి పలు విధాల ప్రాధేయపడ్డాడు. కసి తీరేలా కసురుకుని పంపేశాడు.

ఇప్పుడు పార్వతి ఇలా నేరుగా తన దగ్గరకు వస్తుందనుకోలేదు. తీరా వచ్చేశాక ఎలా ప్రవర్తించాలో అర్థం కావట్లేదు. నిజానికి జరిగిందాంట్లో పార్వతి అపరాధం ఏమీ లేదు. అపరాధం ఏదన్నా ఉంటే తనదే.

అహంకారం..పురుషాహంకారం..ఆధిక్యతాహంకారం..తన వివేకాన్ని చంపేసింది.

తల్లి చెబుతూనే ఉంది. "తొలి అడుగులో అపశ్రుతి ఉండకూడదు. నూరేళ్ళ జీవితానికి శోభనం తొలి అడుగు నాయనా.. ఆ పిల్ల మనసు కష్టపెట్టకు. ఒకర్ని కష్టపెట్టి సంతోషించకూడదు. సంతోషం కలిగించగలిగితేనే, మనకు సంతోషం కలుగుతుంది"

అమ్మ మాటలు మనసులో మారుమోగాయి.

మెల్లగా పార్వతి దగ్గరకు వెళ్ళి తనవైపు తిప్పుకున్నాడు. ఆమె కళ్ళనిండా నీళ్ళు. మృదువుగా తుడిచాడు.

"బాధపడకు. నాదే పొరపాటు.." అంటూ గాఢంగా హత్తుకున్నాడు. పెదవులు ముద్దాడబోతుంటే వేళ్ళు అడ్డంపెట్టి "వద్దు..ఊటీ వెళ్ళాక.." అంది.

అతనికి నవ్వొచ్చింది.

"మీ ఇంటికి వెళ్దాం పద.."

ఆమె ఆశ్చర్యగా చూసింది.

"అవును. నువ్వు సరిగ్గానే విన్నావు. మనం మీ ఇంటికి వెళ్తున్నాం. ఇప్పుడే... ఈ క్షణమే.."

"మరి ఊటీ?"

"తొందరేముంది? తాపీగా వెళ్దాం"

ఆమెకు ఉత్సాహం, ఆనందం పొంగి వచ్చాయి.

అమాంతం అతన్ని ఆలింగనం చేసుకుని "ఐ లవ్‌యూ...ఐలవ్ యూ" అంటూ ముద్దుల వాన కురిపించింది. శివతేజకి ఆనంద జలపాతం కింద కూర్చున్నట్లని పించింది. మరి కాస్సేపటిలో వాళ్ళిద్దరూ పార్వతి ఇంట్లో ఉన్నారు... అందర్నీ అబ్బురపరుస్తూ!

మందహాసం చిందిస్తున్న శివతేజని చెయ్యి పుచ్చుకుని పార్వతి శోభనం గదిలోకి తీసుకెళ్ళి తలుపేసుకుంటే...చూసేవాళ్ళు అవాక్కయ్యారు.

ఆది దంపతులు-కోమలమ్మ, నారాయణం మాత్రం పాతస్మృతులు తలచుకుంటూ, ఒకరినొకరు చూసుకుంటూ ముసిముసి నవ్వులు చిందించారు. వసంతుడు..మన్మథుడు..రతీదేవి..అందరూ ఆ శోభనం గదిలో తిష్ఠవేశారు. కాలం ఆగిపోయింది.

(స్వాతి పోటీలో ఎన్నికైన రచన)